## 'అనుబోస్'లో అ'పూర్వ' సమ్మేళనం



సమ్మేళనంలో పాల్గొన్న పూర్వ విద్యార్థులు, అధ్యాపకులు

పాల్వంచ, ఏప్రిల్ 12: పట్టణంలోని అనుబోస్ ఇం.ఇనీరింగ్ కళాశాలలో శనివారం పూర్వ విద్యార్థుల సమ్మేళనం అపూర్వంగా సాగింది. ఈ కళాశాల 2008లో స్థాపిత మైంది. ఆ సంవత్సరం ఇంజినీరింగ్‌లో చేరిన విద్యార్థులు, అదే కళాశాల వేదికగా శనివార కలుసుకున్నారు. నాటి జ్ఞాపకాలను, అనుభవాలను గుర్తు చేసుకున్నారు. ఉదయం నుంచి సాయంత్రం వరకు ఆనందోత్సాహాలతో జరుపుకున్నారు. నాటి ప్రిన్సిపాల్ టి.వేణుగోపాల్‌ను, అధ్యాపకులను సన్మాంచారు. కళాశాల ఛైర్మన్ తలశిల భరత్‌కృష్ణ, ప్రిన్సిపాల్ బి.రవి, కళాశాల సెక్రటరీ టి.అవని, డైరెక్టర్ ఎన్వీ సుబ్బారావు, వైస్ ప్రిన్సిపాల్ వెంకన్న తదితరులు పాల్గొన్నారు.

## బీఆర్ఎస్ సభ బాగా జరగాలని పూజలు



పూజలు చేస్తున్న హరిప్రియానాయక్, నాయకులు

ఇల్లెందు, ఏప్రిల్ 12: వరంగల్‌లో బీఆర్ఎస్ రజతోత్సవ సభ బాగా జరగాలని వేడుకుంటూ మాజీ ఎమ్మెల్యే బానోత్ హరిప్రియానాయక్, నాయకులు కలిసి శనివారం ఇల్లెందు సుభాష్‌నగర్ కోదండ రామాలయంలో పూజలు చేశారు. దిండిగాల రాజేందర్, శీలం రమేష్, దాస్యం ప్రమోద్, సిలిలేరి సత్యనారాయణ, పరుచూరి వెంకటేశ్వర్లు, రంగనాథ్ తదితరులు పాల్గొన్నారు.

## బీఆర్ఎస్ సభకు భారీగా తరలాలి



మాట్లాడుతున్న కిలారు నాగేశ్వరావు

పాల్వంచ, ఏప్రిల్ 12: ఈ నెల 27న ఎలకతుర్తిలో జరిగే బీఆర్ఎస్ రజతోత్సవ సభకు కొత్తగూడెం నియోజకవర్గం నుంచి మాజీ మంత్రి వనమా వెంకటేశ్వరావు నాయకత్వంలో నాయకులు, కార్యకర్తలు భారీ సంఖ్యలో తరలాలని పార్టీ నాయకుడు కిలారు నాగేశ్వరరావు కోరారు. పాత పాల్వంచలో శనివారం రాత్రి సన్నాహక సమావేశంలో ఆయన మాట్లాడారు. నాయకులు వనమా రాఘవ, బదావత్ శాంతి, మడి సరస్వతి, భూక్యా సోనా, వేల్పుల దామోదర్, మంతపూరి రాజూగౌడ్ తదితరులు పాల్గొన్నారు.

## కల్యాణ రామునికి చక్రస్నానం

### ముగిసిన బ్రహ్మోత్సవాలు

భద్రాచలం, ఏప్రిల్ 12: భద్రాచలంలోని సీతారామచంద్రస్వామి దేవస్థానం ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న బ్రహ్మోత్సవాల్లో భాగంగా శనివారం సీతారామచంద్రస్వామి వారికి పవిత్ర గోదావరి నదిలో చక్రస్నానం నిర్వహించారు. ఈ సందర్భంగా స్వామి వారికి తొలుత ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించి అనంతరం సుదర్శన చక్రంకు పవిత్ర గోదావరి నదిలో చక్రతీర్థం నిర్వహించారు. అనంతరం ఆలయంలో బ్రహ్మోత్సవాల ముగింపులో భాగంగా ధ్వజారోహణం, ద్వాదశ ప్రదక్షణలు, శ్రీ పుష్పయాగంతో బ్రహ్మోత్సవాలు పరిసమాప్తమయ్యాయి. ఆదివారం నుంచి స్వామి వారికి నిత్యకల్యాణాలు పునః ప్రారంభం కానున్నాయి.

### భక్తులతో కిటకిటలాడిన రామాలయం

వరుస సెలవుదినాలు రావడంతో భద్రాచలంలో సీతారామచంద్రస్వామి వారి ఆలయం భక్తులతో కిటకిటాలడుతోంది. రాష్ట్రంలోని వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన భక్తులు ఆలయంలో స్వామి వారికి పూజలు నిర్వహించడంతో పాటు వివిధ ఆర్జిత సేవల్లో పాల్గొంటున్నారు.

## స్వచ్ఛంద సంస్థల సేవలు లెక్కలోకి రావా....

### దేవస్థానం ఈవో వైఖరిపై భక్తుల విమర్శలు

భద్రాచలం, ఏప్రిల్ 12: భద్రాచలంలో శ్రీరామనవమి సమయంలో వేలాదిగా తరలివచ్చిన భక్తులకు అన్నదానం, మజ్జిగ, పులిహోర, దద్దోజనం, తాగునీరు, బెల్లం పానకం అనేక విధాలు భక్తులకు పంపిణీ చేసి తమ ఆత్మీయతను చాటుకున్నారు పలు స్వచ్ఛంద సంస్థలు, ఛాంబర్ ఆఫ్ కామర్స్ నిర్వాహకులు. అలాంటి స్వచ్ఛంద సంస్థలకు సముచిత రీతిలో గౌరవించాల్సిన అధికారులు వారికి కనీస గుర్తింపు ఇవ్వకపోవడంపై తీవ్ర విమర్శలు వ్యక్తమవుతున్నాయి. ప్రతి ఏటా ముక్కోటి, శ్రీరామనవమి సమయంలో స్వచ్ఛంద సంస్థల సేవలు ఉపయోగించుకొని తగిన రీతిలో వారిని గౌరవించడం అనాధిగా వస్తున్న సంప్రదాయం. స్వచ్ఛంద సేవలు అందించడం అటుంచి భక్తులకు ఎంత మేరకు దేవస్థానం అధికారులు సేవలందిస్తారని పలువురు ప్రశ్నిస్తున్నారు.

### దేవస్థానం ఈవో వైఖరిపై విమర్శలు

గతంలో ఎన్నడూ లేనివిధంగా ఈవో తలంబ్రాల పంపిణీలో ఏకపక్ష ధోరణితో వ్యవహరిస్తున్నారని ఛాంబర్ ఆఫ్‌కామర్స్, స్వచ్ఛంద సంస్థల ప్రతినిధులు, భక్తులు విమర్శిస్తున్నారు. ఈవో ఏకపక్ష వైఖరి, నిర్ణయాలతో అటు భక్తులు, ఇటు పట్టణవాసులు ఇబ్బందులు పడుతున్నారని పలువురు ఆరోపిస్తున్నారు.

## రామ భక్తురాలిపై దూసుకెళ్లిన కారు

భద్రాచలం, ఏప్రిల్ 12: భద్రాచలం దేవస్థానం అధికారుల పర్యవేక్షణ, సెక్యూరిటీ సిబ్బంది లోపం కారణంగా ఓ భక్తురాలు ప్రాణపాయం నుంచి బయటపడింది. శనివారం లడ్డూ ప్రసాద విక్రయించే కౌంటరుకు సమీపంలో నిద్రిస్తున్న కరీంనగర్ జిల్లాకు చెందిన భక్తురాలిపై నుంచి కాకినాడకు చెందిన ఓ వ్యక్తి కారు వెళ్లడంతో తీవ్ర గాయాలయ్యాయి. అక్కడే విధుల్లో ఉన్న పోలీసులు ఆమెను భద్రాచలం ఏరియా వైద్యశాలకు తరలించి వైద్య చికిత్స అందిస్తున్నారు. భక్తుల రద్దీ అధికంగా ఉన్నప్పటికీ ఆలయ అధికారులు తగిన ముందస్తు చర్యలు చేపట్టకపోవడంతోనే ఈ ప్రమాదం చోటు చేసుకుందని భక్తులు విమర్శిస్తున్నారు.

మన రాష్ట్రం మన పత్రిక
నమస్తే తెలంగాణ క్లాసిఫైడ్స్ Classifieds
PLOT FOR SALE
★Jangaon DTCP Open Plots Reasonable Price, Clear Title, Prime Location by: SSVPD'S. 7382126789.
NT-329249

గమనిక
క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతిస్పందించే ముందు తగిన రీతిలో క్షుణ్ణంగా విచారించు కోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు చెబుతున్న లేదా చేసుకుంటున్న క్లెయిములతో నమస్తే తెలంగాణ పత్రికకు ఏ విధమైన సంబంధం లేదు. బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్ / డిపాజిట్ చేయవద్దు. పాఠకులు ఈ విషయాన్ని గమనించగలరు.

## టేకులపల్లి ఎస్సైగా రాజేందర్

టేకులపల్లి, ఏప్రిల్ 12: టేకులపల్లి ఎస్సైగా కరకగూడెం ఎస్‌హెచ్‌వో ఆలకుంట రాజేందర్ నియమితులయ్యారు. ఆయన శనివారం విధుల్లో చేరారు.

మన రాష్ట్రం మన పత్రిక
నమస్తే తెలంగాణ
నమస్తే తెలంగాణ దినపత్రికలో
చందా కొరకై మరియు పత్రికా పంపిణీలో
ఏమైన సమస్యలు ఉంటే సంప్రదించగలరు
సెల్ : 9182777073
నమస్తే తెలంగాణ దినపత్రికలో అన్ని రకాల
ప్రకటనలు (అడ్వర్టైజ్‌మెంట్స్) కొరకు సంప్రదించగలరు
సెల్ : 9182777616

# రూ.3.63 కోట్ల గంజాయి పట్టివేత

## 9 మందిపై కేసు నమోదు



పట్టుకున్న గంజాయి, లారీ, నిందితులను చూపిస్తున్న వన్ టౌన్ పోలీసులు

కొత్తగూడెం ప్రగతి మైదాన్, ఏప్రిల్ 12 : సినీ ఫక్కీలో తరలిస్తున్న గంజాయి స్మగ్లర్లను కొత్తగూడెం వన్ టౌన్ పోలీసులు, టాస్క్‌ఫోర్స్ బృందం సంయుక్త ఆధ్వర్యంలో శనివారం దాడులు చేసి పటుకున్నారు. వివరాలిలా ఉన్నాయి.. ఉత్తరప్రదేశ్ రాష్ట్రం ఆగ్రా జిల్లా బోదల పోలీస్‌స్టేషన్ పరిధి జగదీష్‌పురకు చెందిన శివమ్ గుప్తా.. అదే జిల్లా నాగులబుద్ధకు చెందిన భూరీ సింగ్(లారీ డ్రైవర్), భోగిపురానికి చెందిన రవికుమార్‌ను ఏపీ రాష్ట్రం చింతూరు మండలం తులసిపాక నుంచి గంజాయి లోడు చేసుకుని రావాలని రెండు రోజుల క్రితం పురమాయించాడు. ఈ క్రమంలో తులసిపాక చేరుకున్న భూరీ సింగ్, రవికుమార్‌లు ఏడుగురు వ్యక్తుల నుంచి 727.360 కేజీల గంజాయిని కొనుగోలు చేసి లారీ క్యాబిన్-ట్రక్కుకు మధ్య ఛాంబర్‌లా ఏర్పాటు చేసి అందులో అమర్చారు. అనంతరం తిరిగి భద్రాచలం, హైదరాబాద్ మీదుగా ఆగ్రాకు గంజాయిని తరలించేందుకు యత్నించారు. అయితే భద్రాద్రి జిల్లా పోలీసులకు అందిన విశ్వసనీయ సమాచారం మేరకు ఇక్కడి పోలీసులు వాహన తనిఖీలు చేపట్టారు. కొత్తగూడెం వన్ టౌన్ ఇన్‌స్పెక్టర్ ముప్పారపు కరుణాకర్ నేతృత్వంలో ఎస్సై విజయ, తన సిబ్బంది, టాస్క్‌ఫోర్స్‌తో సంయుక్తంగా శేషగిరినగర్ కాలనీ వద్ద వాహన తనిఖీలు చేపట్టారు. భూరీ సింగ్ తరలిస్తున్న లారీ అటువైపుగా రావడంతో దాన్ని అడ్డుకొని తనిఖీ చేయగా.. గంజాయి ప్యాకెట్లు బయటపడ్డాయి. వెంటనే పోలీసులు వారిని అదుపులోకి తీసుకుని లారీతోపాటు, రూ.3,63,68000 విలువ చేసే గంజాయిని స్వాధీనం చేసుకుని సీజ్ చేశారు. లారీ డ్రైవర్ భూరీ సింగ్, రవికుమార్‌తోపాటు గంజాయి కొనుగోలు చేసిన శివమ్ గుప్తా, ఆంధ్రాకి చెందిన విక్రయదారులు కొర్రా సీతారాములు, వంతాల విశ్వనాథ్, వంతాల బాబురావు, కిలో చిన్నారావు, కిలో సాయిబాబు, కిలో శంకర్‌రావు, భద్రిలపై కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నట్లు ఇన్‌స్పెక్టర్ కరుణాకర్ తెలిపారు. గంజాయి స్మగ్లర్లను పట్టుకున్న వన్ టౌన్ ఇన్‌స్పెక్టర్ కరుణాకర్, ఎస్సై విజయ, సిబ్బందిని ఎస్పీ రోహిత్ రాజు ప్రత్యేకంగా అభినందించారు.

### పాల్వంచలో..

పాల్వంచ, ఏప్రిల్ 12: ఒడిశా రాష్ట్రంలోని మల్కాన్‌గిరి నుంచి మహారాష్ట్రలోని పూణేకు తరలిస్తున్న రూ.28.80 లక్షల విలువైన 51.27 కేజీల గంజాయిని ఖమ్మం ఎన్‌ఫోర్స్‌మెంట్ పోలీసులు శనివారం పాల్వంచలో పట్టుకున్నారు. విలేకరులకు ఎన్‌ఫోర్స్‌మెంట్ సీఐ సుంకరి రమేష్ తెలిపిన వివరాలు.. మహారాష్ట్రలోని పూణే జిల్లా ధౌండ్ తాలూకా పంపల్ గ్రామానికి చెందిన సాగర్ హరిదాస్ దోబ్లే, నీలేష్, కిషోర్ కలిసి గంజాయి రవాణా ముఠాగా ఏర్పడ్డారు. ఒడిశా రాష్ట్రంలోని మల్కాన్‌గిరిలో తక్కువ రేటుకు ఎండు గంజాయి కొన్నారు. దానిని కారులో ఆంధ్రా-ఒడిశా సరిహద్దు నుంచి భద్రాచలం, పాల్వంచ మీదుగా పూణేకు తరలిస్తున్నారు. ఈ సమాచారంతో ఖమ్మం ఎన్‌ఫోర్స్‌మెంట్ సీఐ సుంకరి రమేష్, హెడ్ కానిస్టేబుల్ బాలు, కానిస్టేబుళ్లు సుధీర్, వెంకటేష్, విజయ్‌కుమార్, ఉపేందర్ కలిసి పాల్వంచలో నిఘా వేశారు. వాహనాల తనిఖీ చేపట్టారు. అటుగా వచ్చిన ఒక కారు.. ఆగకుండా వెళ్లబోయింది. దానిని పోలీసులు అడ్డగించారు. ఆ కారులో కారులో ప్యాక్ చేసి ఉన్న 51.27 కేజీల ఎండు గంజాయి దొరికింది. దీని విలువ రూ.28.80లక్షలు ఉంటుంది. కారులో ఉన్న మహారాష్ట్రలోని పూణే జిల్లా ధౌండ్ తాలూకా పంపల్ గ్రామానికి చెందిన సాగర్ హరిదాస్ దోబ్లే, నీలేష్, కిషోర్‌ను అదుపులోకి తీసుకున్నారు. వారి నుంచి కారుతోపాటు గంజాయిని, మూడు సెల్‌ఫోన్లను స్వాధీనపర్చుకున్నారు. ముగ్గురు నిందితులను కోర్టులో హాజరుపరిచారు. గంజాయిని కోర్టు ద్వారా పాల్వంచ ఎక్సైజ్ అండ్ ప్రొహిబిషన్ సీఐ ప్రసాద్‌కు అప్పగించారు. గంజాయి పట్టుకున్న ఎన్‌ఫోర్స్‌మెంట్ సీఐ రమేష్‌ను, సిబ్బందిని డైరెక్టర్ ఆఫ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ కమలహసన్ రెడ్డి, ఉమ్మడి ఖమ్మం జిల్లా డీసీ జనార్దన్ రెడ్డి, అసిస్టెంట్ కమిషనర్ గణేష్, ఏఈ తిరుపతి అభినందించారు.

# వనజీవి రామయ్యకు నివాళి



కొత్తగూడెం టౌన్: నివాళులర్పిస్తున్న ప్రకృతి ఆశ్రమ నిర్వాహకులు

కొత్తగూడెం టౌన్, ఏప్రిల్ 12: కొన్ని దశాబ్దాల పాటు ఒంటరిగా కోటి మొక్కలు నాటి, వనజీవిగా పేరొంది, పద్మశ్రీ అవార్డు అందుకున్న ఖమ్మం రూరల్ మండలానికి చెందిన వనజీవి రామయ్య(87) గుండె పోటుతో మృతిచెందారు. ఆయనకు కొత్తగూడెం ప్రకృతి ఆశ్రమం సభ్యులు శనివారం నివాళులర్పించారు. ఆయన స్ఫూర్తితో పర్యావరణ రక్షణకు కృషి చేస్తామని ప్రతినబూనారు. సుగుణారావు (కో ఆర్డినేటర్), మొక్కల వెంకటయ్య, రాయి లక్ష్మి, శ్రీరంగం సంపత్ కుమార్, మొక్కల సాంబయ్య, బంగారి శంకర్ తదితరులు పాల్గొన్నారు.

రామవరం, ఏప్రిల్ 12: వనజీవి రామయ్యకు నివాళిగా కొత్తగూడేనికి చెందిన ప్రకృతి ప్రేమికుడు మొక్కల వెంకటయ్య, స్థానిక ఎస్సీబీ నగర్‌లోగల మొక్కల ప్రాంగణంలో మొక్క నాటారు. రామవరం పరిరక్షణ కమిటీ సభ్యులు ముస్తాఫా, గోరంట్ల సుగుణారావు తదితరులు పాల్గొన్నారు.

చండ్రుగొండ, ఏప్రిల్ 12: మండలంలోని గుర్రంగూడెం గ్రామంలోని అటవీ ప్రాంతంలో చెట్ల వద్దకు ఉపాధి హామీ పథకం కూలీలు శనివారం చేరుకుని, వనజీవి రామయ్యకు నివాళులర్పించారు. పర్యావరణ రక్షణకు వనజీవి రామయ్య చేసిన కృషి గురించి మాట్లాడుకున్నారు.

భద్రాచలం, ఏప్రిల్ 12: పద్మశ్రీ వనజీవి రామయ్య మరణం పర్యావరణ ప్రేమికులకు తీరని లోటని, భద్రాద్రి వాసులతో రామయ్యది విడదీయని బంధమని గ్రీన్ భద్రాద్రి సభ్యులు పేర్కొంటున్నారు. ఆయనతో కలిసి పలుమార్లు మొక్కలు నాటడం ఆయన ఆశీర్వాదం తీసుకునే భాగ్యం కగలడం అదృష్టమని గ్రీన్ భద్రాద్రి నిర్వాహకులు గాదె మాధవరెడ్డి పేర్కొంటున్నారు. రామయ్య అంత్యక్రియలను ప్రభుత్వ లాంఛనాలతో నిర్వహించి ఆయనను గౌరవించాలని కోరారు.

# రాజ్యాంగ స్ఫూర్తికి కేంద్రం విఘాతం



పాల్వంచ: అంబేద్కర్ సెంటర్‌లో నిరసన తెలుపుతున్న సీపీఐ శ్రేణులు

కొత్తగూడెం అర్బన్, ఏప్రిల్ 12: రాజ్యాంగ స్ఫూర్తికి కేంద్ర ప్రభుత్వం తూట్లు పొడుస్తూ, విధ్వంసకర పరిపాలన సాగిస్తున్నదని సీపీఐ జిల్లా కార్యదర్శి షేక్ సాబీర్‌పాషా ఆరోపించారు. మార్చి 23 (భగత్‌సింగ్ వర్ధంతి) నుంచి ఏప్రిల్ 14 (డాక్టర్ అంబేద్కర్ జయంతి) వరకు రాజ్యాంగ పరిరక్షణ కార్యక్రమాలు చేపట్టాలని సీపీఐ జాతీయ సమితి ఇచ్చిన పిలుపులో భాగంగా ఆ పార్టీ శ్రేణులు శనివారం సుజాతనగర్ నుంచి కొత్తగూడెం వరకు ప్రదర్శన, కొత్తగూడెంలో మానవహారం నిర్వహించాయి. సాబీర్‌పాషా మాట్లాడుతూ.. స్వాతంత్ర్య సమరయోధుల ఆశయాలకు బీజేపీ తూట్లు పొడుస్తున్నదని, రాజ్యాంగాన్ని అపహాస్యం చేస్తున్నదని విమర్శించారు. బీజేపీ ప్రభుత్వ హయాంలో దళితులు, గిరిజనులు, మైనారిటీలు, మహిళలపై దాడులు పెరిగాయని; ప్రభుత్వ రంగం దెబ్బతింటున్నదని ఆందోళన వ్యక్తం చేశారు. వీటికి వ్యతిరేకంగా ప్రజలు ఉద్యమించాలని కోరారు. నాయకులు సలిగంటి శ్రీనివాస్, భూక్యా దస్రు, వీరస్వామి, కంచర్ల జమలయ్య, ధనలక్ష్మి, భూక్యా శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

పాల్వంచ, ఏప్రిల్ 12: పట్టణంలో సీపీఐ శ్రేణులు శనివారం ర్యాలీ నిర్వహించాయి. అంబేద్కర్ కూడలిలో సభ నిర్వహించాయి. నాయకులు ముత్యాల విశ్వనాథం, బండి నాగేశ్వరరావు, ఉప్పుశెట్టి రాహుల్, అన్నారపు వెంకటేశ్వర్లు, చెన్నయ్య, మడుపు ఉనేంద్రాచారి తదితరులు పాల్గొన్నారు.

### వక్ఫ్ బిల్లుకు వ్యతిరేకంగా..

అశ్వారావుపేట, ఏప్రిల్ 12: వక్ఫ్ సవరణ బిల్లుకు వ్యతిరేకంగా సీపీఐ నాయకులు స్థానిక రింగ్ రోడ్డు సెంటర్‌లో అంబేద్కర్ విగ్రహం వద్ద నల్ల బ్యాడ్జీలు ధరించి నిరసన వ్యక్తం చేశారు. సయ్యద్ సలీమ్, గన్నిన రామకృష్ణ, నూకవరపు విజయ్‌కాంత్, బలరాం, చీపుర్ల సత్యావతి, రిజ్వానా తదితరులు పాల్గొన్నారు.

దమ్మపేట రూరల్, ఏప్రిల్ 12: దమ్మపేటలో సీపీఐ నాయకులు శనివారం నిరసన తెలిపారు. ధర్మా తదితరులు పాల్గొన్నారు.

## వ్యక్తి ఆత్మహత్య

పర్ణశాల, ఏప్రిల్ 12: దుమ్ముగూడెం మండలం ప్రగళ్ళపల్లి పంచాయతీ సున్నంబట్టి గ్రామంలో దున్న రాజు(50) ఆత్మహత్య చేసుకున్న ఘటన శనివారం జరిగింది. ఈ ఘటనపై పోలీసులు తెలిపిన వివరాలు ప్రకారం.. రాజు గోదావరి నదిలో చేపలు పట్టుకుంటూ జీవిస్తున్నాడు. ఇతనికి ఇద్దరు కుమార్తెలు, ఒక కొడుకు ఉన్నారు. రాజు భార్య ఖాదరమ్మ కాన్సర్‌తో చనిపోయింది. అప్పటి నుంచి రాజు మద్యానికి బానిసయ్యాడు. మద్యం సేవించనప్పుడల్లా తన భార్యలేకుండా బతకలేనని తనవాళ్ళతో అనేవాడు. శుక్రవారం రాత్రి గ్రామ శివారులో ఉన్న గోదావరి నది ఒడ్డుకు చేపలు పట్టడానికి అని వెళ్ళిన వ్యక్తి శనివారం ఉదయం 5 గంటల సమయంలో గోదావారి ఒడ్డున ఉన్న చెట్టుకు ఉరివేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. తెల్లవారుజామున చేపలు వేటకు వెళ్ళిన తోటి గ్రామస్తులు ఈ ఘటన చూసి మృతుని కుటుంబసభ్యులకు సమాచారం ఇచ్చారు. తనతండ్రి మనోవేదనకు గురై ఆత్మహత్య చేసుకున్నాడని పోలీసులకు ఫిర్యాదు చేయగా సీఐ అశోక్ కుమార్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

## పాత కార్లు దగ్ధం

పాల్వంచ, ఏప్రిల్ 12: పట్టణంలోని తెలంగాణ నగర్‌లో బీఎల్ నాయుడుకు చెందిన పాత ఇనుప దుకాణాల సముదాయంలో ఆదివారం అగ్ని ప్రమాదం జరిగింది. స్క్రాప్‌కు వచ్చిన పది పాత కార్లు దగ్ధమయ్యాయి. మంటలను ఆర్పేందుకు అక్కడి సిబ్బంది చేసిన ప్రయత్నాలు ఫలించలేదు. వారు ఇచ్చిన సమాచారంతో కొత్తగూడెం ఫైర్ స్టేషన్ నుంచి, కేటీపీఎస్ నుంచి మొత్తం ఫైర్ ఇంజిన్లు వచ్చి మంటలను ఆర్పేశాయి. ప్రమాద స్థలాన్ని ఎస్సై సుమన్ పరిశీలించి వివరాలు సేకరించారు.

## కారు ఢీకొని వ్యక్తి మృతి

పాల్వంచ రూరల్, ఏప్రిల్ 12: రోడ్డు ప్రమాదంలో వ్యక్తి మృతిచెందాడు. పోలీసులు తెలిపిన వివరాలు.. కటుకూరి నాగభూషణం(63), ద్విచక్ర వాహనంపై మండలంలోని లక్ష్మిదేవిపల్లి(ఎస్) వద్ద శనివారం రోడ్డు దాటుతున్నాడు. అదే సమయంలో కొత్తగూడెం నుంచి భద్రాచలం వైపు వేగంగా వెళ్తున్న కారు, రోడ్డు క్రాస్ చేస్తున్న నాగభూషణం వాహనాన్ని ఢీకొంది. నాగభూషణానికి తీవ్ర గాయాలయ్యాయి. ఆయనను ముందుగా కొత్తగూడెం ఆసుపత్రికి, ఆ తర్వాత ఖమ్మం ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. ఖమ్మం ఆసుపత్రిలో మృతిచెందాడు. ఆయన అల్లుడు సురేష్ ఫిర్యాదుతో కారు డ్రైవర్ కోయిల విజయ్‌కుమార్‌పై రూరల్ పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు జరుపుతున్నారు.

## ముగ్గురు మోసగాళ్లు అరెస్టు

బూర్గంపాడు, ఏప్రిల్ 12 : రైస్ పుల్లింగ్ మిషన్ అమ్మకం పేరుతో మోసం చేస్తున్న ముగ్గురు వ్యక్తులను శనివారం అరెస్టు చేసినట్లు బూర్గంపాడు ఎస్సై రాజేష్ తెలిపారు. సారపాక గ్రామంలో పెట్రోలింగ్ నిర్వహిస్తుండగా అనుమానాస్పదంగా కనిపించిన వ్యక్తులను అదుపులోకి తీసుకొని విచారించగా రైస్‌పుల్లింగ్ మిషన్ ఉందని నమ్మించి పలువురి వద్ద డబ్బులు వసూలు చేస్తున్నట్లు ఒప్పుకున్నట్లు తెలిపారు. అరెస్టు చేసిన వారిలో పాల్వంచకు చెందిన దొనకొండ సురేష్‌బాబు, భద్రాచలంకు చెందిన ఎస్కే రహీం, ఉర్ల శ్రీనివాసరావు ఉన్నారని, మరో నిందితుడు నారాయణ పరారీలో ఉన్నట్లు ఎస్సై పేర్కొన్నారు.

## బెల్లం వాహనం పట్టివేత

కొత్తగూడెం ప్రగతి మైదాన్, ఏప్రిల్ 12 : కొత్తగూడెం ఎక్సైజ్ పోలీసులు శనివారం రేగళ్ల క్రాస్‌రోడ్డు వద్ద 360 కిలోల రంగుమారిన బెల్లంతోపాటు, 15 కిలోల పటికతో వెళ్తున్న వాహనాన్ని పట్టుకున్నారు. వివరాల్లోకెళ్తే.. రూట్ వాచ్ నిర్వహిస్తుండగా పెద్దబజార్ వద్ద అనుమానం వచ్చి దోస్త్ వాహనాన్ని పరిశీలించగా బెల్లంతోపాటు పటిక దొరికిందని ఎస్సై శ్రీహరిరావు తెలిపారు. ఈ బెల్లం, పట్టికను కొనుగోలు చేసిన కొత్తగూడెం పెద్దబజార్‌కు చెందిన హెచ్.రామ్‌కుమార్, డ్రైవర్ లకావత్ మంగీలాల్‌పై కేసు నమోదు చేసినట్లు పేర్కొన్నారు. అయితే పోలీసులు లారీని పట్టుకొని అశోక్ లే ల్యాండ్ దోస్త్ వాహనాన్ని చూపెడుతున్నారని స్థానికులు ఆరోపిస్తున్నారు. ఆ లారీని స్థానికులు ఫొటోలు తీయడం చర్చానీయంశంగా మారింది.

## ధాన్యం కొనుగోలు కేంద్రం ప్రారంభం

చండ్రుగొండ, ఏప్రిల్ 12: మండలంలోని దామరచర్లలో ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ఎమ్మెల్యే జారే ఆదినారాయణ శనివారం ప్రారంభించారు. ఏడీఏ రవికుమార్, సొసైటీ ఛైర్మన్ చెవుల చందర్‌రావు, వైస్ ఛైర్మన్ నల్లమోతు వెంకటనారాయణ తదితరులు పాల్గొన్నారు.

## జానపద కళాకారుల సంఘం కమిటీ ఎన్నిక

దమ్మపేట, ఏప్రిల్ 12: జానపద కళాకారుల సంఘం మండల కమిటీని అశ్వారావుపేట గిరిజన భవన్‌లో శనివారం జరిగిన సమావేశం ఎన్నుకుంది. అధ్యక్షుడిగా తోట మల్లేశ్వరరావు, ప్రధాన కార్యదర్శిగా ముహరి నాగరాజు, కార్యదర్శిగా మోదంపురపు వెంకటేశ్వరరావు, గౌరవ సలహాదారుగా ఏపురి పేరయ్య, మరికొందరు సభ్యులుగా ఎన్నికయ్యారు. రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎస్.లింగన్న పాల్గొన్నారు.

## తాగునీటి సమస్య పరిష్కారానికి వినతి

ఇల్లెందు రూరల్, ఏప్రిల్ 12: ఇల్లెందులోని సీఎస్‌పీ బస్తీ శివారు దేవులపల్లి యాకయ్య నగర్‌లోని గుడిసె వాసులు.. తమకు తాగునీరు ఇవ్వాలని, సోలార్ లైట్లు ఏర్పాటు చేయాలని కోరుతూ శనివారం సింగరేణి జీఎం కార్యాలయం ఎదుట సీపీఎం ఆధ్వర్యంలో ధర్నా నిర్వహించారు. జీఎం కృష్ణయ్యకు వినతి పత్రం ఇచ్చారు. నాయకులు అబ్దుల్ నబి, తాళ్ళూరి కృష్ణ, మన్యం మోహన్ రావు, సురేష్, వీరభద్రం, వీరస్వామి తదితరులు పాల్గొన్నారు.

## అంబేద్కర్ జయంతి వేడుకలు ఘనంగా నిర్వహించాలి

భద్రాచలం, ఏప్రిల్ 12: భద్రాచలంలో అంబేద్కర్ జయంతిని ఘనంగా నిర్వహించాలని మాలమహానాడు జిల్లా అధ్యక్షుడు దాసరి శేఖర్ పేర్కొన్నారు. భద్రాచలంలో శనివారం జరిగిన మాలమహానాడు మండల కమిటీ సమావేశంలో ఆయన మాట్లాడారు. కార్యక్రమంలో శనిగిరి చిట్టిబాబు,అర్జున్, దేవరాజు, రమేష్‌కుమార్, పాపయ్య, శ్రీను, తాళ్ల రాజు, వెంకట్ పాల్గొన్నారు.

ఇల్లెందు రూరల్, ఏప్రిల్ 12: రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బీఆర్ అంబేద్కర్ జయంతి వేడుకను ఈ నెల 14న ఘనంగా నిర్వహించాలని అధికారులను ఏరియా జీఎం కృష్ణయ్య ఆదేశించారు. వారితో ఆయన శనివారం తన కార్యాలయంలో సమావేశమయ్యారు. జేకే కాలనీ బస్టాప్ అంబేద్కర్ విగ్రహం వద్ద వేడుకకు ఏర్పాట్లు చేయాలన్నారు. అధికారులు నర్సింహరాజు, జీవీ మోహన్‌రావు, నాగరాజు నాయక్, వెంకటేశం, శ్రీనివాస్‌రావు, బ్రహ్మం పాల్గొన్నారు.

మణుగూరు టౌన్, ఏప్రిల్ 12: డాక్టర్ బీఆర్ అంబేద్కర్ జయంతిని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. మణుగూరు మండల మాలమహానాడు ఆధ్వర్యంలో ఈ నెల 14వ తేదీన అంబేద్కర్ జయంతిని పురస్కరించుకొని మణుగూరు అంబేద్కర్ కూడలిలో జరిగే కార్యక్రమానికి మున్నూరు కాపు సంఘం నాయకులను వారి కార్యాలయానికి వెళ్లి ఆహ్వానించారు. కార్యక్రమంలో వేర్పుల నరేష్, బూర్గుల సతీష్, దాసరి వెంకట్, వేర్పుల సురేష్, గాండ్ల సురేష్, మామిడిపల్లి సీతారాములు, దాచేపల్లి శ్రీనివాస్, బత్తుల శ్రీనివాస్, పులిశెట్టి బాబు, కాట్రగడ్డ రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

## బడి బాట కరపత్రాలు అందజేత

చుంచుపల్లి, ఏప్రిల్ 12: మండలంలోని విద్యానగర్ కాలనీ ప్రాథమిక పాఠశాలలో పిల్లలను చేర్పించాలని కోరుతూ 'బడి బాట' కరపత్రాలను సీనియర్ సిటిజన్స్ అసోసియేషన్ ముద్రించి, ప్రధానోపాధ్యాయురాలు నీరజకు అందజేసింది. అసోసియేషన్ సెక్రటరీ సురేష్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

## పంపిణీ పూర్తి చేయండి

అశ్వారావుపేట, ఏప్రిల్ 12: మండలంలోని ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులకు మొదటి విడతగా ఏకరూప దుస్తులు వచ్చాయి. స్థానిక ఎమ్మార్సీ వద్ద వీటిని ప్రధానోపాధ్యాయులకు ఎంఈవో ప్రసాదరావు అందించారు.

## అగ్ని బాధితురాలికి బీఆర్ఎస్ సాయం

ములకలపల్లి, ఏప్రిల్ 12: మండలంలోని రామచంద్రపురం గ్రామస్తురాలు బాల్దా అరుణమ్మ ఇల్లు ఇటీవల అగ్ని ప్రమాదంలో పూర్తిగా దగ్ధమైంది. ఆమెకు శనివారం రూ.26వేలను బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు మోరంపూడి అప్పారావు అందజేశారు. నాయకులు సున్నం నాగమణి, భారత రాంబాబు, అచ్చన కృష్ణారావు, రొంటె నాగేశ్వరరావు, చిన్నం సుధాకర్, నాగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

## ముగిసిన నవమి బ్రహ్మోత్సవాలు

పర్ణశాల, ఏప్రిల్ 12: ప్రముక పుణ్యక్షేత్రమైన పర్ణశాలలో శ్రీరామనవమి బ్రహ్మోత్సవాలు ముగింపు సందర్భంగా శనివారం ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా సీతారాముల వారి ఉత్సవ విగ్రహాలకు గోదావరి నదిలో చక్రస్నానాలు నిర్వహించారు. ముందుగా ఆలయ ప్రధాన ఆలయ ప్రాంగణంలో ఉత్సవ మూర్తులకు విశేష అభిషేకం, తరుమంజనం కార్యక్రమాలు నిర్వహించి మంగళ వాయిద్యాల నడు సుదర్శన పెరుమాళ్ళను తిరువాది సేవ నిర్వహించి పవిత్ర గోదావరి నదిలో వేద మంత్రాల మధ్య సాంప్రదాయ బద్దంగా పూజా కార్యక్రమాలు నిర్వహించారు. కార్యక్రమంలో ఆలయ అధికారి అనీల్ కుమార్, అర్చకులు కిరణ్‌కుమార్, ఆచార్యులు బార్గవచార్యులు, పరద్వాజచార్యులు, వెంకటాచర్యులు, రాజగోపాల్ చార్యులు పాల్గొన్నారు.

## బొమ్మనపల్లి పాఠశాల పరిశీలించిన డీఈ

టేకులపల్లి, ఏప్రిల్ 12: మండలంలోని బొమ్మనపల్లి ప్రభుత్వ ప్రాథమిక పాఠశాల వంటశాల పైకప్పు నుంచి ఇటీవల పెళ్లలు ఊడి పడ్డాయి. వంట మనిషికి గాయాలయ్యాయి. ఈ నేపథ్యంలో, పాఠశాలను ఇంజినీరింగ్ విభాగం జిల్లా అధికారి(డీఈ) నాగేశ్వరాచారి శనివారం పరిశీలించారు. పునర్నిర్మాణ పనులు చేపట్టాలని నిర్ణయించారు. ఏఈ యూసుఫ్ అలీ, ఎంఈవో జగన్, ఎంఈవో జగన్ పాల్గొన్నారు.

## ఆదివాసీ హక్కులపై అవగాహన కలిగి ఉండాలి

ఆళ్ళపల్లి, ఏప్రిల్ 12: ఆదివాసీ హక్కులపై ఆదివాసీ ప్రజలకు అవగాహన కలిగి ఉండాలని మాజీ ఎంపీపీ కొండ్రు మంజుభార్గవి అన్నారు. శనివారం మండల కేంద్రంలో ఏఈడబ్ల్యూసీ జిల్లా కార్యదర్శి జోగ రాంబాబు అధ్యక్షతన నిర్వహించిన సమావేశంలో ఆమె మాట్లాడారు. ఆదివాసీలకు అవసరమైన ఆదివాసీ కమ్యూనిటీ హాల్, కుమ్రం భీం విగ్రహం త్వరలో ఏర్పాటు చేసుకొవాలని కార్యచరణ గురించి చర్చించారన్నారు. కార్యక్రమంలో సుబ్బరావు, సాంబశివరావు, గాదే రాజు, సురేష్, సారయ్య, కిశోర్‌బాబు, బొజ్జయ్య, లక్ష్మయ్య, సత్యం, వెంకటేశ్వర్లు, వెంకటకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

## వర్గ పోరాటాలు కొనసాగించడమే కుంజా బొజ్జికి నివాలి

భద్రాచలం, ఏప్రిల్ 12: వర్గ పోరాటాలు కొనసాగించడమే కుంజా బొజ్జికి ఇచ్చే ఘనమైన నివాళి అని సీపీఎం జిల్లా కార్యదర్శి మచ్చ వెంకటేశ్వర్లు అన్నారు. భద్రాచలంలో శనివారం సీపీఎం ఆధ్వర్యంలో కుంజా బొజ్జి వర్ధంతి వేడుకల సందర్భంగా ఆయన చిత్రపటానికి పూలమాల వేసి నివాళి అర్పించారు. నాదెళ్ల లీలావతి, ఎంబి నర్సారెడ్డి, కొలగాని బ్రహ్మాచారి, గడ్డం స్వామి, బండారు శరత్, ఎంవి ప్రసాదరావు, పి.సంతోష్‌కుమార్, కోరాడ శ్రీనివాస్, సండ్ర భూపేంద్ర, డి.కనక, చొక్కా మాధవరావు పాల్గొన్నారు.

దుమ్ముగూడెం, ఏప్రిల్ 12: మార్కిస్టు మహానేత కుంజా బొజ్జి అని సీపీఎం జిల్లా కమిటీ సభ్యులు యలమంచి వంశీకృష్ణ పేర్కొన్నారు. దుమ్ముగూడెం మండలం ములకపాడు గ్రామంలో శనివారం బొజ్జి వర్ధంతి సభ నిర్వహించారు. ఈ సందర్భంగా సీపీఎం మండల కార్యదర్శి కారం పుల్లయ్య బొజ్జి చిత్రపటానికి నివాళి అర్పించారు. మర్మం చంద్రయ్య, బిల్లా ముత్యాలరావు, కల్లూరి శ్రీను, చంటి, నాగరాజు, లక్ష్మయ్య పాల్గొన్నారు.

## బస్ షెల్టర్ ప్రారంభం

బూర్గంపాడు, ఏప్రిల్ 12: బూర్గంపాడు మండలం కృష్ణసాగర్ గ్రామం వద్ద ఐటీసీ సంస్థ సహకారంతో రూ.10లక్షలతో నిర్మించిన బస్ షెల్టర్‌ను పినపాక ఎమ్మెల్యే పాయం వెంకటేశ్వర్లు శనివారం ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో ఐటీసీ మేనేజర్ చంగల్‌రావు, దుర్గంపూడి కృష్ణారెడ్డి పాల్గొన్నారు. అలాగే రూ.15 లక్షల అంచనా వ్యయంతో నిర్మించిన నూతన అంగన్‌వాడీ కేంద్రాన్ని ఎమ్మెల్యే ప్రారంభించారు.

## నేడు కరకగూడెంలో విద్యుత్ అంతరాయం

కరకగూడెం, ఏప్రిల్ 12: నేడు( ఆదివారం) కరకగూడెం మండలంలో విద్యుత్ సరఫరాకు అంతరాయం ఉంటుందని మండల ట్రాన్స్‌కో ఏఈ నరేందర్ రెడ్డి శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. 33/11 కేవీ ఉపకేంద్రం నందు భట్టుపల్లి 11 కేవీ లైన్ మరమ్మతులు ( చెట్లు తొలిగింపు) చేపట్టనున్నట్లు పేర్కొన్నారు. ఉదయం 8 గంటల నుంచి మధ్నాహ్నం 11 గంటల వరకు అంతరాయం ఉంటుందని వినియోగదారులు సహకరించాలని కోరారు.

## కరకగూడెం ఎస్ఐ రాజేందర్ బదిలీ

కరకగూడెం, ఏప్రిల్ 12: జిల్లా వ్యాప్తంగా పలువురు ఎస్ఐలను బదిలీ చేస్తూ శనివారం పోలీస్‌శాఖ ఉన్నతాధికారులు ఉత్తర్వులను జారీ చేశారు. ఇందులో భాగంగా కరకగూడెం ఎస్ఐ రాజేందర్‌ను టేకులపల్లి ఎస్ఐగా బదిలీ చేశారు. భద్రాచలం టౌన్‌లో ఎస్ఐగా విధులు నిర్వహిస్తున్న పీవీ నాగేశ్వరరావును కరకగూడెం పోలీస్‌స్టేషన్‌కు బదిలీ చేస్తూ ఉత్తర్వులు జారీ చేశారు.

## రాజీవ్ యువ వికాసం కోసం హెల్ప్‌డెస్క్

మణుగూరు టౌన్, ఏప్రిల్ 12: ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా ఏర్పాటు చేసిన రాజీవ్ యువ వికాసం పథకానికి సంబంధించి అభ్యర్థుల సందేహాలను నివృత్తి చేసేందుకు అధికారులు ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నారు. ఇందులో భాగంగా మణుగూరు మున్సిపల్ కార్యాలయంలో హెల్ప్ డెస్క్‌ను ఏర్పాటు చేశారు. మణుగూరు మున్సిపాలిటీ పరిధిలో ఇప్పటి వరకు 1100 దరఖాస్తులు వచ్చాయని అధికారులు తెలిపారు.

## రేపు రాజ్యాంగ రక్షణ పాదయాత్ర

ములకలపల్లి/అన్నపురెడ్డిపల్లి, ఏప్రిల్ 12: 'జై బాపు, జై భీమ్, జై సంవిధాన్'పై కాంగ్రెస్ కార్యకర్తలకు ఎమ్మెల్యే జారే ఆదినారాయణ శనివారం ములకలపల్లిలో, అన్నపురెడ్డిపల్లిలో అవగాహన సమావేశాలు నిర్వహించారు. రాజ్యాంగ రక్షణ కోసమే ఈ కార్యక్రమాన్ని కాంగ్రెస్ పార్టీ చేపట్టిందన్నారు. ఈ నెల 14న డాక్టర్ బీఆర్ అంబేద్కర్ జయంతి సందర్భంగా అన్ని మండలాల్లో రాజ్యాంగ పరిరక్షణ పాదయాత్ర నిర్వహించాలన్నారు.

## ముగ్గురు మావోయిస్టులు మృతి

### ఛత్తీస్‌గఢ్ రాష్ట్రంలో ఎదురుకాల్పుల ఘటన

కొత్తగూడెం ప్రగతి మైదాన్, ఏప్రిల్ 12 : భద్రతా దళాలు, మావోయిస్టులకు మధ్య జరిగిన ఎదురుకాల్పుల్లో ముగ్గురు మావోయిస్టులు మృతి చెందారు. ఈ ఘటన ఛత్తీస్‌గఢ్ రాష్ట్రం బీజాపూర్ జిల్లాలో శనివారం చోటు చేసుకుంది. బస్తర్ రేంజ్ ఐజీ సుందర్‌రాజ్ పాటిలింగం ఇందుకు సంబంధించిన వివరాలను వెల్లడించారు. బీజాపూర్ జిల్లా ఇంద్రావతి నేషనల్ పార్క్ ఏరియా అడవుల్లో మావోయిస్టులు సంచరిస్తున్నారనే సమాచారం పోలీసు ఉన్నతాధికారులకు అందింది. దీంతో సీఆర్‌పీఎఫ్, కోబ్రా 202, 210వ బెటాలియన్లు, స్పెషల్ టాస్క్‌ఫోర్స్, జిల్లా రిజర్వ్ గార్డ్స్ భద్రతా బలగాలు సంయుక్తంగా సెర్చింగ్ ఆపరేషన్ నిర్వహించాయి. ఈ క్రమంలో కొలనార్ అటవీ ప్రాంతంలో ఉదయం 9 గంటల ప్రాంతంలో మావోయిస్టులు తారసపడి జవాన్లపైకి కాల్పులు జరిపారు. వెంటనే అప్రమత్తమైన భద్రతా దళాలు ఎదురుకాల్పులు జరపడంతో ఇరువర్గాల మధ్య గంటపాటు భీకరపోరు జరిగినట్లు తెలుస్తోంది. అప్పటికే సుమారు 400 మంది జవాన్లు చుట్టుముట్టడంతో వారి ధాటికి తాళలేక మావోయిస్టులు కాల్పులు జరుపుతూనే దట్టమైన అటవీ మార్గంలోకి పారిపోయారు. కాల్పుల విరమణ తర్వాత జవాన్లు ఆ ప్రాంతాన్ని తమ ఆధీనంలోకి తీసుకుని గాలింపు చర్యలు చేపట్టారు. ఎదురుకాల్పుల్లో మృతిచెందిన ముగ్గురు మావోయిస్టుల మృతదేహాలతోపాటు వారికి సంబంధించిన ఆయుధ, వస్తు సామగ్రిని జవాన్లు స్వాధీనం చేసుకున్నారు.